ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024



డిఎంహెచ్ఒగా భాస్కరరావు

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ ఎస్.భాస్కరరావు నియమితులయ్యారు. ఈయన విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు రానున్నారు. ఇప్పటి వరకూ మన్యం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఇన్‌ఛార్జి అధికారిగా కె.విజయపార్వతి పనిచేస్తున్నారు.



అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- సీతానగరం/ పార్వతీపురంటౌన్, రూరల్

ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సీతానగరం హనుమాన్ జంక్షన్ కూడలి వద్ద ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే, యాత్రికులు అధికంగా వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే రహదారులు ప్రధానమని, కావున రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. నియోజవర్గంలో అత్యాధునిక హంగులతో ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలు, పార్వతీపురంలో బస్టాండ్, బస్ డిపోను నిర్మించనున్నామని చెప్పారు. అంతకు ముందు పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన డ్రైవింగ్ ట్రాక్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ జిల్లాలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ ఉందని, ఇక్కడ కనీస మౌలిక వసతులు కూడా లేవని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ మిగిలిన జిల్లాల మాదిరిగా శాశ్వతంగా గుర్తుండి పోయే అన్ని సౌకర్యాలు ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌తో పాటు బస్ డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌టిసి జోన్ - 1 ఇడి ఆకాశపు విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో 250 ఆర్‌టిసి బస్సులు తిరుగుతున్నాయని, వీటి ద్వారా రూ.34 లక్షల ఆదాయం సంస్థకు లభిస్తుందని తెలిపారు. విశాఖపట్నంకు వెళ్లే బస్సుల ద్వారానే 50 శాతం ఆదాయం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో మూడు వంతెనల నిర్మాణం పూర్తికావాల్సి ఉందని, అవి పూర్తయితే సంస్థకు మరింత అధిక ఆదాయం లభిస్తుందని ఆఆశాభావం వ్యక్తం చేశారు. రాష్టంలోని తొలి పది స్థానాల్లో ఈ జిల్లా ఆర్‌టిసి నిలవడం గర్వకారణమన్నారు. సమావేశంలో డిటిఒ కె.శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ డైరక్టరు జి.వెంకటినాయుడు, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పల నాయుడు, పార్వతీపురం డిపో మేనేజర్ ఇ.ఎస్.కె.దుర్గ, సీతానగరం మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, వేణుగోపాల నాయుడు, పెద్దభోగి సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉపసర్పంచ్ కె.అరువింద కుమార్, నాయకులు లక్ష్మణరావు, హరిగోపాల్, బుడితి శ్రీనివాస రావు, ఎస్ఎస్ శ్రీనివాస రావు, గొంపస్వామి, శంకర్రావు పాల్గొన్నారు.



సీతానగరంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోండి

కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో ప్రభుత్వంపై ఉద్యోగులంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నా మని, అందులో ప్రధానంగా **24X7** గంటలు పనిచేసే ఉద్యోగుల్లో ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను, పరిష్కరించేం దుకు మంత్రి చొరవ తీసుకోవాలని ఎపి పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు మంత్రికి వినతి అందజేశారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కెజె సుభాకర్, కార్యదర్శి బికె మూర్తి, కోశాధికారి జి.తాటాలు పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాత విలవిల

నీటిపాలైన వరి, పొగాకు, మొక్కజొన్న

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికి వచ్చే సమయానికి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జిల్లాలో అధికశాతం వరిసాగువుతోంది. కోతలు ఆఖరు దశకు చేరుకోవడంతో ఉద్యాన పంటలైన మొక్కజొన్న, పత్తి, బొప్పాయి వంటి పంటలకు నష్టం వాటిల్లింది.

మండలంలో ఈ ఏడాది వర్షాలు రైతులకు అనుకూలంగా కురవడంతో వరి పంట బాగా పండింది. మండలంలో సుమారు 4 వేల ఎకరాలలో వరి సాగైంది. అందులో 50 శాతం వరకు పంట కోత అయ్యింది. మిగతాది కోయడానికి సిద్ధంగా ఉంది. కొందరు కోసినా పొలాల్లో దిబ్బలు వేశారు. మరికొందరు ధాన్యాన్ని సమయానికి తేలేక నూర్చి కళ్లాల్లో రాసులుగా వుంచుకొన్నారు. ఇలా ఉంచిన ధాన్యం, వరి దిబ్బలకు ఈ వర్షాల వల్ల వాటి కిందకు పోయే పంటపడువుతుందన్న భయం లేకుంది. అన్ని రకాల పంటలకు నష్టమే. ఈ ఆకాల వర్షాలతో అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలో వరి తర్వాత అత్యధికంగా సాగయ్యేది మొక్క జొన్న. ఈ పంటను రబీ సీజన్లో సుమారు 2వేల ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ పంటలో కూడా సాధారణ రకం, సీడ్ అనే రెండు రకాలుగా సాగుచేస్తున్నారు. ఈ వర్షానికి సాధారణ రకం మొక్కజొన్నకు పెద్దగా నష్టం జరగకపోయినా, సీడ్ సాగుకు విపరీతమైన తెగుళ్ల సోకే ప్రమాదం వుందని ఇప్పుడిప్పుడే నాటిన విత్తనం మొలకెత్తే అవకాశం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇక వాణిజ్య పంట బొప్పాయి, పొగాకు కూడా ఈ వర్షాలకు పురుగులు వచ్చే అవకాశం వుంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ ఆకాల వర్షాలు తగ్గుముఖం పడితే కొంత ఉపశమనం కలుగుతుందన్నారు.



నీట మునిగిన మొక్కజొన్న



జలమయమైన పొగాకు మొక్కలు



విఆర్ఎస్, పెద్దగెడ్డ, ఆంద్ర నీటి సంఘాల ప్రాజెక్టు కమిటీ చైర్మన్లను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రాజెక్టు కమిటీ చైర్మన్లకు మంత్రి అభినందన

ప్రజాశక్తి - సాలూరురూరల్

నియోజకవర్గంలో శనివారం జరిగిన నీటి సంఘాల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికల్లో మూడు ప్రాజెక్టులకు గానూ మూడింటిని కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంది. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు చైర్మన్‌గా మత్స గోదావరి, వైస్ చైర్మన్‌గా పెంట సత్యం, పెద్దగెడ్డ ప్రాజెక్టు చైర్మన్‌గా గుంప్రోతు పార్వతమ్మ, వైస్ చైర్మన్‌గా యాసర్ల అప్పారావు, ఆంద్ర ప్రాజెక్టు చైర్మన్‌గా కోడి సతీష కుమార్, వైస్ చైర్మన్‌గా పి.గంగునాయుడు ఎన్నిక య్యారు. వీరికి రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందనలు తెలిపారు.

పిల్లలకు ఆధార్ చేయించాలి

ప్రజాశక్తి - సీతంపేట

పిల్లలలకు తప్పనిసరిగా ఆధార్‌లో తప్పనిసరిగా నమోదు కావాలని పాలకొండ డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీతంపేట, భామిని మండలాల డిజిటల్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖ సిబ్బందితో ఆధార్ సమన్వయ సమావేశం ఆయన నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలందరికీ తప్పనిసరిగా ఆధార్ ఉండేలాగా చూడాలన్నారు. అంగన్వాడీ, సచివాలయం సిబ్బంది ఆధార్ క్యాంపులు నిర్వహించి ఆధార్ కార్డులో నమోదు చేయించాలని ఆదేశించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎఒ మాస తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియా కేసులు తగ్గాల్సిందే

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ఎనీమియా కేసుల్లో ప్రతి నెలా తగ్గుదల కనిపించాల్సిందేనని వైద్యాధికారులు, ఎఎన్ఎంలకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తేల్చిచెప్పారు. ముఖ్యంగా గర్భిణీల్లో రక్తహీనత ఉండరాదని, కనీసం 11 శాతానికి తగ్గరాదని స్పష్టం చేశారు. లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహించిన, గర్భిణీలో రక్తహీనత ఉన్నట్లు నిర్ధారణ అయితే స్థానిక వైద్యాధికారి, ఎఎన్ఎం, అంగన్వాడీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనీమియాపై వైద్యాధికారులు, సిడిపిఒలు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనీమియాను నివారించేందుకు పోషకాహారాన్ని, మందులను పెద్దఎత్తున పంపిణీ చేస్తున్నప్పటికీ నివారణ ఉండకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించారు. ఇకపై వైద్యాధికారులు అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి నెలా తగ్గుదల కనిపించాలని, సాధించిన ప్రగతి నివేదికను తమకు అందజేయాలని ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు ఎప్పటి కప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి, అనీమియా సమస్య లేకుండా చూడాలని, ప్రతి నెలా రక్త శాతం పెరుగుదల కనిపించాలని, లేకుంటే సంబంధిత వార్డెన్లపై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రుల పరిధిల్లోనూ కేసులు తగ్గేలా చూడాలని అన్నారు. తోణాం, దుడ్డుకల్లు పిహెచ్‌సిల పరిధిలో రక్తహీనత ఎక్కువగా ఉండడం పట్ల కలెక్టర్ ప్రశ్నిస్తూ, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి వారం రోజుల పాటు అక్కడే బసచేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలపై దృష్టి సారించాలని, సికిల్ సెల్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవడం, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫీడర్ అంబులెన్సులు వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రక్తదాన శిబిరాలను ఎక్కువగా నిర్వహించాలని అన్నారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం పార్వతీపురం, సాలూరు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని అన్నారు. భవిత కార్డులో విద్యార్థినుల అనీమియా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎటిడబ్ల్యుఒగా కృష్ణవేణి

ప్రజాశక్తి- సాలూరు

సహాయ గిరిజన సంక్షేమాధికారిగా (ఎటిడబ్ల్యుఒ) శనివారం ఆర్. కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా పని చేసిన కె.శ్రీనివాసరావు విజయనగరం జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో పని చేస్తున్న సహాయ గిరిజన సంక్షేమ అధికారి కృష్ణవేణి ఇక్కడికి బదిలీ పై వచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

విద్యుత్తు బిల్లులు ఉపసంహరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని, వివిధ వర్గాల ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సిపిఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చాక దుడ్డుకర్రలతో ప్రజలపై బాదుడుకు దిగారని ఎద్దేవా చేశారు. ట్రూ అప్ సర్దుబాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీలను వడ్డిస్తున్నారని, అసలు కంటే కొసరే అధికంగా ప్రజలపై పడుతుందని అన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక ఇంకొక మాట మాట్లాడటం సరికాదన్నారు. ఈ భారాలు తక్షణమే ఉపసంహరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే అదానీతో జరిగిన విద్యుత్తు ఒప్పందాల వల్ల ప్రజలపై అదనంగా లక్ష కోట్ల రూపాయలు భారాలు మోపడానికి సిద్ధపడడం దారుణమన్నారు. ఆదానీ ఒప్పందాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తామన్నది హాస్యాస్పదమన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు, మండల కమిటీ సభ్యులు ఎ.లక్ష్మణరావు, ఎ.భానుసుందర్, కాద రాము, దూసి దుర్గారావు, బి.వాణీప్రభ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పాచిపెంటలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అహంకార పూర్తి వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. అంబేద్కర్ పేరును అవమానిస్తూ పార్లమెంట్లో అమిత్‌షా మాట్లాడడం భారత జాతి మొత్తాన్ని అవమానించడమేనని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎస్సీ, ఎస్టీ బీసీ పేదలందరికీ ఉందని, ఇప్పటికైనా తన తప్పులు తెలుసుకొని భారతజాతికి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, వెంటనే మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలని, అంబేద్కర్ ఆశయాలను కాపాడుకోవాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొండంగి చిరంజీవిరావు, జి.ప్రసాద్, కొర్ర కళ్యాణ్, మంచాల శ్రీనివాసరావు, సూకూరు అప్పలస్వామి, ఎర్రయ్య, కె.శ్రీనివాసరావు, ఎస్.పండు, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఉపాధ్యాయులకు మద్దతుగా విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - సీతంపేట

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, చదువు చెప్పేందుకు పాఠశాలలకు పంపించాలని కోరుతూ మల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు శనివారం స్థానిక ఐటిడిఎ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో బోధనకు ఆటంకం కలుగుతుందని పరీక్షలు దగ్గర పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఐటిడిఎ ఎదుట ఆందోళన చేశారు. ఉపాధ్యాయులు గురుకుల పాఠశాలకు రావాలని నినాదాలు చేశారు. వెంటనే ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ కె.దేశ్‌పాండే, ఎఎంఒ పి.కోటి బాబు నిరసన వద్దకు వచ్చి విద్యార్థులకు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం జరుగుతుందని సర్ది చెప్పడంతో విద్యార్థులు తిరిగి వెనదిరిగారు.

కొనసాగుతున్న దీక్షలు

పార్వతీపురం : గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 32వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షా శిబిరంలో తెలుగు సబ్జెక్టు పాఠ్యంశాలు బోధిస్తూ నిరసన తెలిపారు. వీరి నిరసనకు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు మాటలు కోటలు దాటుతోందని, ఆచరణ, అమలు గడప దాటడం లేదని ఏద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తిరుపతి నాయుడు, రమణ, కామేష్, కళ్యాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చగలరా?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నిన్నగాక మొన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు పంచాయతీ సిరివర గిరిజన గ్రామాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బాగుజోల- సిరివర గ్రామాల మధ్య నిర్మించనున్న రహదారితో పాటు పలు గ్రామాల సౌకర్యార్థం తలపెట్టిన రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన ప్రాంతంలో తాగునీరు, రహదారి సదుపాయాలు మెరుగుపర్చడం తోపాటు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని, ముఖ్యంగా వైద్య సదుపాయాల కోసం డోలిమోతల దుస్థితి లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రకటన లను కేవలం గిరిజనులు మాత్రమే కాదు, యావత్తు ఉమ్మడి విజయనగరం జిల్లా స్వాగతిస్తోంది. కానీ, ఈ సదుపాయాలకు అంతలా నిధులు కేటాయించాలన్నా, గిరిజనులకు మరిన్ని సంక్షేమ పథకాలు వర్తించాలన్నా, చివరకు గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల పెత్తనం కట్టడిచేయాలన్నా 5వ షెడ్యూల్ ఏరియాల ఉన్నవాటికి మాత్రమే సాధ్యమౌతుంది. మరి ప్రభుత్వం అందుకు సిద్ధపడుతుందా? లేదా? అన్న చర్చ పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పబ్లిక్ టాక్‌గా నిలిచింది. ఇందుకు కారణం లేకపోలేదు. 5వ షెడ్యూల్ ఏరియా పెంపునకు పాలక పార్టీల్లో ఇన్నాళ్లూ రాజకీయ చిత్తశుద్ధి కొరవడింది. దీంతో, గిరిజన ప్రాంతంలోని భూములు, అటవీ, ఖనిజ సంపద లూటీ అవుతున్నాయి. ముఖ్యంగా 1/70 చట్టం వర్తించక పోవడంతో ఏజెన్సీలోని భూములు చాలా వరకు స్థానికేతర గిరిజనేతరులు చేతుల్లోకి పోతున్నాయి. గిరిజన ప్రాంతంలో పుట్టి, పెరిగినా ఆయా గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చక పోవడం వల్ల కొండలు, డి-పట్టా భూములు ఆక్రమించుకోవడం వంటివి యథేచ్ఛగా సాగిపోతు న్నాయి. చివరికి రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలను సైతం గిరిజనులు పొందలేకపోతున్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక గిరిజనుల హక్కులు మరింతగా హరించి పోతున్నాయి. నోరు మెదిపితే బిజెపి, అందులో కీలకంగావున్న ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా జపం చేస్తున్న పవన్ కల్యాణ్ మరి ఇప్పుడు వారిని ఒప్పించి, కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న పలుకుబడి ఉపయోగించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపగలరా? అన్నదానిపై బహిరంగంగానే చర్చ నడుస్తోంది.

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన 2019 నవంబర్ 12న జరిగిన గిరిజన సలహా మండలి సమావేశం 554గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు తీర్మానించింది. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 182, శ్రీకాకుళం జిల్లాలో 240, విశాఖలో 91, తూర్పుగోదావరిలో 40, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక గ్రామం చొప్పున ఉన్నాయి. ఈ ప్రకటనకు 20 రోజుల వ్యవధిలో అప్పటి ప్రభుత్వం (గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప-శ్రీవాణి) యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపాదిత షెడ్యూల్ గ్రామాల్లో కొన్నిచోట్ల అభ్యంతరాలు, మరికొన్ని గుర్తించాల్సిన గ్రామాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో రీసర్వే చేస్తామని 2019 డిసెంబర్ 2న పుష్పశ్రీవాణి ప్రకటన చేశారు. ఇందులో వాస్తవం ఉన్నప్పటికీ, సర్వే నివేదిక 35ఏళ్ల క్రితం నాటిదని కొత్తగా చెప్పడం పట్ల అప్పట్లో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ సమస్యపై దశాబ్దాలు తరబడి పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేకపోయినప్పటికీ ఉమ్మడి రాష్టంలో ఎపి గిరిజన సంఘం అనేక సర్వేలు చేపట్టింది. సుమారు 1200 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాల్సిందని అంచనాలు రూపొందించింది. రాష్ట్ర విభజన తరువాత విస్తీర్ణం, జనాభా రీత్యా దాదాపు 700 గ్రామాలను ప్రతిపాదించాల్సి ఉందని గిరిజన సంఘాలు చెబుతున్నాయి.

సాలూరు మండలంలో 90రెవెన్యూ గ్రామాలు ఉండగా, షెడ్యూల్ ఏరియాలోవున్నవి 24 మాత్రమే ఉన్నాయి. ప్రతిపాదిత గ్రామాలు 44 ఉన్నప్పటికీ మరో పది గ్రామాల వారు షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మక్కువ మండలంలో 21పంచాయతీల పరిధిలో సుమారు 54 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో కేవలం శంబర గ్రామానికి చెందిన బీరమాసి ఒక్కటే షెడ్యూల్ ఏరియా పరిధిలోవుంది. మండలం మొత్తం అటవీ ప్రాంతంలో ఉండడం, మెజార్టీ గ్రామాల్లో ఎక్కువ మంది గిరిజనులు ఉండడం వల్ల 52గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజన సంఘాలు ఏళ్లతరబడి డిమాండ్ చేస్తుండగా గిరిజన సలహా మండలి ప్రతిపాదనలో కేవలం 26 మాత్రమే ఉండడం గమనార్హం. పాచిపెంట మండలంలో 54 రెవెన్యూ గ్రామాలకుగాను ప్రస్తుతం 21గ్రామాలు మాత్రమే షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయి. మిగిలిన అత్యధిక గ్రామాల్లో గిరిజన జనాభాయే ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటీవల కేవలం 17 గ్రామాలను మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో చేర్పించేందుకు ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన మండలాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది. 5వ షెడ్యూల్ పరిధిలో ఉంటే గిరిజన ప్రాతంలోని అటవీ సంపద, పార్వతీపురం మండలం బడిదేవర కొండ, సాలూరు మండలం తామరకొండల్లోని గ్రానైట్ సహా అనేక చోట్ల నిక్షిప్తమైవున్న గనులు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం అంత సులువు కాదు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో తిష్టవేసి, అటవీ సందపద, విలువైన భూములు ఆక్రమించుకున్న ధనికులు, పెట్టుబడిదారులకు ఇబ్బంది కలుగుతుంది. వారి ప్రయోజనాల కోసమే గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు బిజెపి మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో, గిరిజనులకు ఐటిడిఎ పథకాలు కూడా వర్తించని దుస్థితి ఉంది. అయినప్పటికీ జగన్, చంద్రబాబు ప్రభుత్వాలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేయలేదు. నేడు డిప్యూటీ సిఎంగా అందలమెక్కిన పవన్ కల్యాణ్ అందుకు కృషి చేయగలరా? అని జనం చర్చించుకుంటున్నారు.

పవనన్నా.. ముందు బాబును ప్రశ్నించండి

సూపర్ సిక్స్ హామీల అమలేదీ : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల అమలు బాధ్యత తనదేనని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు సిఎం చంద్రబాబు నాయుడును ప్రశ్నించాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరి శిఖర గ్రామాల్లో డిప్యూటీ సీఎం పర్యటించడం, శిరివర రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అభినందనీయమేనని చెప్పారు. అయితే ఆ రోడ్డు చరిత్ర తెలుసుకుని మాట్లాడి వుంటే బావుండేదని చెప్పారు. 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలోనే శిరివర గిరిశిఖర నుంచి గిరిజన గర్భిణీ మహిళని డోలీమోతలో తీసుకొస్తుండగా ఆమె మార్గమధ్యంలో ప్రసవించిందని చెప్పారు. ఆ సంఘటన జాతీయ మీడియాలో కూడా ప్రచురించడంతో జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి, ఐటిడిఎ పిఒకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఆ వెంటనే అప్పటి సిఎం చంద్రబాబునాయుడు శిరివర రోడ్డు నిర్మాణానికి రూ.8కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు కానీ నిధులు విడుదల కాలేదని చెప్పారు. టిడిపియే ఈ రోడ్డు నిర్మాణానికి నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. శుక్రవారం డిప్యూటీ సీఎం ప్రయాణించిన బాగుజోల వరకు రోడ్డు వైసిపి ప్రభుత్వం హయాంలోనే నిర్మించినట్లు గుర్తు చేశారు. శిరివర వరకు మట్టిరోడ్డు నిర్మాణం చేసిందీ తమ ప్రభుత్వం హయాంలోనేనని చెప్పారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందకపోవడానికి కారణం ఎవరో తెలుసుకుని మాట్లాడి వుంటే బావుండేదని చెప్పారు. బాగుజోల, చిలకమెండంగికి ఏ నాయకులు రాలేదని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఆ గ్రామాల్లో ఎన్నిసార్లు పర్యటించానో అక్కడ గిరిజనులను అడిగితే చెపుతారని అన్నారు. డిప్యూటీ సిఎం పక్కనే ఉన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఎన్నిసార్లు గిరిశిఖర గ్రామాలను సందర్శించారో అడిగి వుంటే బాగుండేదని చెప్పారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వి.అప్పలనాయుడు జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, డోల బాబ్జీ, చినబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏరియా హాస్పిటల్‌లో శనివారం సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సివిల్ సర్జన్ డివి శ్రీనివాస్ రక్త దానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు. ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ నిల్వగది ఉందని బ్లడ్ స్టోరేజ్ చేస్తున్నామని చెప్పారు. అత్యవసర సమయంలో ఈ బ్లడ్ ఇవ్వడానికి ముందుకు వస్తానన్నారు. యువత ఉద్యోగులు ప్రజలు బ్లడ్ ఇవ్వడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గడగమ్మలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో శనివారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు మధుమేహం ఈ సందర్భంగా జ్వర పీడితులు మధుమేహ, రక్తపోటు, గర్భిణులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు,104 సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను కించపరచడం తగదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై బిజెపి అగ్రనేత, కేంద్ర హెూం శాఖ మంత్రి ఇటీవల మాట్లాడిన మాటలు అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని దిగజార్చేలా ఉన్నాయని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపడ్డారు. దేశాన్ని ఏలుబడి చేస్తున్న బిజెపి పెద్దలు మోడీ, అమిత్ షాలు అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెడుతూ తమ అజెండాలో మరో వందేళ్ల అధికారాన్ని శాసించాలని చూస్తున్నారని విమర్శించారు.

పరిశుభ్రతను పాటించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రస్తుతం తుపాను కారణంగా వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు అన్నారు. శనివారం అలమండ పంచాయతీ చినతోలు మండగూడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలకు, గర్భిణులకు వైద్య సేవలు అందించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

29న నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఈ నెల 29న నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్లు బి వాసుదేవరావు, జేవి సూర్యప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజు కూడా అవసరం లేదని, ఆసక్తి కలవారు హాజరుకావాలని, టెస్ట్ ముగించిన గంటలోపే ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక సహకారం వి అన్నజీరావు అందిస్తారని మరిన్ని వివరాలకు 8639618305, 9676957948, 79816639 నెంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వైసిపి ఎస్‌సి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వైసిపి జిల్లా మైనార్టీ సెల్, ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా పార్వతీపురానికి చెందిన షేక్ షఫీ, సరివిట్టి శ్రీనివాసులను పార్టీ నియమించింది. ఈ మేరకు శనివారం నూతన అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయా వర్గాలను బలోపేతం చేసి, భవిష్యత్తులో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ ఎస్.తిరుపతినాయుడు

అత్యున్నత స్థానాలకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సమాజంలో వికలాంగ విద్యార్థులను అత్యున్నత సాతనాలకు తీసుకెళ్లడమే సహిత విద్య ఉద్దేశమని డిఇఒ ఎన్.తిరుపతినాయుడు అన్నారు. జిల్లా సహితవిద్య విభాగంలో ఓరియంటేషన్ కార్యక్రమం ఎంఇఒలకు స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఇఒతో పాటు వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ భానుమూర్తి, రిసోర్స్ పర్సన్ రాయిడి శంకర్రావు, ఎంఇఒలు, డిఇఐసి సిబ్బంది ఉదయ్ కుమార్, స్రవంతి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస్ రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నిజ జీవితంలో మ్యాథ్స్‌తో సంబంధం ఉంటుందని మ్యాథ్స్ పట్ల భయాన్ని వీడి ఇష్టంతో సాధన చేసినట్లయితే చరిత్ర సృష్టించగలరని విద్యార్థులకు తెలిపారు. మ్యాథ్స్ లెక్చరర్ జి తులసి మాట్లాడుతూ విద్యార్థులు మ్యాథ్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులు, భవిష్యత్తులో గణితం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చరిత్ర, ఎకనామిక్స్ లెక్చరర్‌లు ఏ శ్రీవాణి, స్వరూప, ఐక్యూ ఏసీ మెంబర్ వి కల్పన పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: బహుమతులతో విద్యార్థులు

పాలకొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం, ప్రపంచ ధ్యాన దినోత్సవం జరిగింది. ప్రధానోపాధ్యాయులు మీసాల సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి గణిత ప్రాధాన్యతను వివరించారు. గత రెండు దశాబ్దాలు నుంచి పాఠశాల తరగతి గదిలో విద్యార్థులకు ధ్యానం మూడు నిముషాలు చేయిస్తున్నామని సంస్కృత ఉపాధ్యాయులు శంకర్రావు తెలిపారు. గణిత ఉపాధ్యాయులు అప్పారావు, సంధ్యారాణి గణిత పోటీలు పెట్టి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



మక్కువ: రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మక్కువ: గణిత శాస్త్రవేత్త రామానుజన్ గణిత శాస్త్రానికి అందించే సూత్రాలు మరువలేనివని ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. శనివారం ములక్కాయవలస మోడల్ పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత శాస్త్రానికి సంబంధించి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సిస్టు భారతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యం కానున్న సిపిఐ (ఎంఎల్), న్యూడెమోక్రసీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 28న హైదరాబాదులో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీలు ఐక్యం కానున్నాయని, ఈ ఐక్యత బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికారి ప్రతినిధి ఎం.గోపాలం శనివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఒకే సైద్ధాంతిక, రాజకీయ విధానం కలిగిన సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ 2013 నుంచి రెండు పార్టీలుగా విడిపోయి కొనసాగుతున్న క్రమంలోనూ అఖిలభారత స్థాయిలో నాలుగు విప్లవ సంస్థల మధ్య ఐక్యతా చర్చలు గత ఐదారేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ, ఆశించినంత పురోగతి పెద్దగా లేదన్నారు. ఈ నేపథ్యంలోనే సైద్ధాంతికంగానూ, రాజకీయపరంగానూ భావసారూప్యం కలిగివున్న రెండు సిపిఐ(ఎం-ఎల్), న్యూడెమోక్రసీ ఐక్యతా ప్రయత్నాలు ఫలప్రదం కావడంతో ఈనెల 28న హైదరాబాద్లో పెక్యతా ప్రకటన చేయాలని నిర్ణయించాయని తెలిపారు.

జిల్లాకే తలమానికంగా క్రీడా ప్రాంగణం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాకే తలమానికంగా అత్యాధునిక , అధునాతన హంగులతో క్రీడా ప్రాంగణాన్ని నిర్మించనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శాప్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా క్రీడాకారుల కోసం అధునాతన, అత్యాధునిక హంగులతో క్రీడా ప్రాంగణాన్ని నిర్మించుకోనున్నట్లు చెప్పారు. ఇటువంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తేనే రాష్ట్రం అభివద్ధి చెందినట్లని మంత్రి అభిప్రాయపడ్డారు. కేంద్రం నిధులతో నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నామన్నారు. అధికారులంతా ఇక్కడే నివసించేలా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ బంగ్లాలతో పాటు ప్రభుత్వ క్వార్టర్స్‌ను కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. తొలుత ఎన్‌సిసి విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మంత్రి మొక్కలను నాటారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీ, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, డిఎస్ఒ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్‌టిసి జోన్ -1 ఇడి ఆకాశపు విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, పార్వతీపురం డిపో మేనేజర్ ఇ.ఎస్.కె.దుర్గ, జిల్లా రవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పాస్టర్స్ ఫ్యామిలీ ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జోరువానను సైతం లెక్కచేయకుండా సీతానగరం చుట్టుపక్కల గల ఏడు మండలాలకు చెందిన దైవజనులు ఈ కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ట్రెజరర్ జొన్నాడ చంటి పాస్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకులుగా జోగింపేట సీయోను ప్రార్థన మందిరం నిర్వాహకులు పాస్టర్ జాకబ్ ఏసుక్రీస్తు పుట్టుకు సంబంధించిన అనేక మర్మాలను వివరించారు. ఉత్తరాంధ్ర క్రిస్టియన్ ఫోరం అధ్యక్షులు అక్కివరపు మోహన్ రావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు నిజమైన దేవుడుగా కొనియాడారు. కార్యక్రమంలో సీతానగరం సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ, ఫెలోషిప్ అధ్యక్షులు పి.అహరోను, సెక్రెటరీ ఎస్.భాస్కరరావు, ట్రెజరర్ జె.చంటి, వైస్ ప్రెసిడెంట్ ఎ.పుష్పారావు, కమిటీ సభ్యులు కె.డేవిడ్, జాయింట్ సెక్రెటరీ ఎస్ లక్ష్మణరావు, అడ్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ పథకం అమలుకు కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం, పాలకొండ డివిజన్లలోని అన్ని గ్రామాల్లోనూ స్వమిత్వ పథకం అమలుకు పంచాయతీరాజ్, రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాప్ కోసం ఏర్పాటు చేసిన ఈ పథకం సామాజిక ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా 6.62 లక్షల గ్రామాలలో ఈ సర్వే చేపట్టనున్నారని, ఆస్తి డేటాను సేకరించడమే లక్ష్యంగా చేపట్టే ఈ సర్వేలో డ్రోన్‌తో సహ వివిధ సాంకేతికతను ఉపయోగించడానికి అవకాశం ఉందని అన్నారు. ఈ పథకంపై పూర్తి అవగాహన పెంచుకొని సిబ్బంది కార్యక్రమం అమలుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ పార్వతీపురం డిఎల్‌పిఒలు నాగభూషణరావు, రమా ప్రసాద్, సర్వే శాఖ ఏడి, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి కొండలరావు

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షులు ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ మహిళా కమిషన్ - జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు మోసపోకుండా జాగృతం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళ మానసికంగా చైతన్యవంతులైనప్పుడే కుటుంబం సమర్థవంతంగా నిర్వహించగలరని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడమే కాకుండా న్యాయవాదిని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, విద్యార్థినులను ర్యాగింగ్ పేరిట వేధిస్తే ధైర్యంగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన, రిసోర్స్ పర్సన్స్ టి.జోగారావు, ఎమ్. స్రవంతి, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, జిల్లా లేబర్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.నీలకంఠం, ఎంపిడిఒ ఎం.మల్లికార్జున రావు, ఎఒ శంకరరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి దామోదరరావు

'వట్టిగెడ్డ' కమిటీ అధ్యక్షులుగా సత్యంనాయుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మ వలస మండలం రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పరజపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు మూడడ్ల సత్యం నాయుడు, వైస్ చైర్మన్‌గా చినమేరంగి నీటిసంఘం అధ్యక్షులుగా ముంజేటి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వట్టి గెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు ఎన్నికలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో తుంబలి, కుదమ, జియమ్మ వలస, గిజబ నీటిసంఘాల అధ్యక్షులు వావిలపల్లి రమణనాయుడు, ఏగిరెడ్డి లక్ష్మంనాయుడు, దాసరి శ్రీనివాసరావు, మండల రామినాయుడు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలో పాల్గొని మూడడ్ల సత్యం నాయుడును ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, అరకు పార్లమెంట్ అధ్యక్షులు డొంకాడ రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు, టిడిపి నాయకులు గురాన శ్రీరామమూర్తి నాయుడు, నందివాడ కృష్ణబాబు, రెడ్డి బలరాం స్వామి నాయుడు, జోగి భుజంగరావు, గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

'తోటపల్లి' చైర్మన్‌గా పాదిలాపు

వీరఘట్టం: సర్దార్ గౌతు లచ్చన్న (తోటపల్లి) జలాశయం ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక శనివారం జరిగింది. పాదిలాపు విజయరమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.రామచంద్రరావు ఎన్నికైనట్టు ధ్రువపత్రం అందజేశారు. వైస్ చైర్మన్‌గా రాజులగుమ్మడ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఆలుబిల్లి పార్థసారథి నామినేషన్ వేయగా, తుండి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా బొత్స వెంకటనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మనుమకొండలో నీతి అయోగ్ బృందం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మనుమకొండలో శనివారం నీతి అయోగ్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మనుమకొండ గ్రామంలోని గిరిజనులతో సమావేశమై గ్రామంలో ఉన్న మౌలిక వసతుల కల్పనపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిపిఎస్ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్తు, రోడ్డు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బత్తిలి పిహెచ్‌సిని పరిశీలించి అక్కడ వైద్యాధికారితో మాట్లాడుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్ కుమార్, మధుసూదనరావు, కోఆర్డినేటర్ మహేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, వైద్యాధికారులు, మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


థింసా నృత్యాన్ని తిలకిస్తున్న నీతి అయోగ్ అధికారులు

గర్భిణుల వసతిగృహ సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహాన్ని శనివారం డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి సందర్శించారు. గర్భిణుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐరన్ మాత్రలు వినియోగించుకుని, వేడి ఆహారం తీసుకోవాలన్నారు. ఈ సీజన్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు సలహాలు ఇచ్చారు. సౌకర్యాలపై ఆరా తీసి, రిజిస్టర్ పరిశీలించారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. డిఎంహెచ్ఒతో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గర్భిణుల జాబితాను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

మూడు గ్రామాల్లో పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో నిర్వహించిన 23 పీసా గ్రామసభల్లో మూడు గ్రామాల్లో ఎన్నికలు జరగ్గా మిగిలిన 20 గ్రామాల్లో ఏకగ్రీవంగా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. దిగువ చాపరాయిగూడ, దొండ మామిడిగూడ, బుడగరాయి గ్రామసభల్లో ఎన్నికలు జరిగాయని తెలిపారు. మిగతా గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది చెప్పారు. పీసా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని పిఒ తెలిపారు. అలాగే ఈనెల 23, 27, 28, 30 తేదీల్లో కూడా ఇదే వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పిఒ తెలిపారు.

విద్యార్థుల మరణాలపై ఎస్‌టి కమిషన్ నోటీసులు

ప్రజాశక్తి- పార్వతీపురం


ఉత్తరాంధ్ర జిల్లాల్లో వున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై జాతీయ ఎస్‌టి కమిషన్ నోటీసులు జారీ చేసింది. గిరిజన విద్యార్థుల మరణాలు, వారి కుటుంబాలకు మంజూరు చేస్తున్న పరిహారం, నివారణకు చేపడుతున్న చర్యల గురించి వాస్తవాలతో కూడిన నివేదిక నెల రోజుల్లో అందజేయాలని మిషన్ గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కు ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఈనెల 14న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు, వారి కుటుంబాలకు పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం, ఎఎన్ఎంల నియామకంలో జాప్యం పై జాతీయ ఎస్‌టి కమిషన్‌కి లేఖ రాశారు. దీనిపై స్పందించిన కమిషన్ గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కి నోటీసులు జారీ చేసింది.

ఘనంగా జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం చిన మేరంగి కోటలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరిక్షిత్ రాజు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేద మహిళకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, పట్టణ నాయకులు పిరిడి రామకృష్ణ, ఎం.అప్పారావు, హరి బాలాజీ, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, డోల బాబ్జీ, పాచిపెంట చినబాబు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

పార్వతీపురంటౌన్: మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కూడలి వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు వాకాడ నాగేశ్వరరావు, పట్టణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపిపిలు, వైస్ చైర్ పర్సన్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ స్టేట్ డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కురుపాం : మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కురుపాం రావాడ జంక్షన్‌లో గల వైయస్సార్ విగ్రహం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన కేక్ కట్ చేసి స్థానిక సిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టు, పాలు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభయలు జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ షేక్ నిసార్, మండల కో ఆప్షన్ షేక్ జిలానీ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల వైసిపి కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైస్ ఎంపిపి రంగారావు, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి.బంగారునాయుడు, టివిఎస్ స్వామియోజులు, జి.సంతోషిని, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రంలో వైసిపి ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతా కలిసి వైయస్సార్ విగ్రహం వద్ద జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కటింగ్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి సీనియర్ నాయకులు వాకాడ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జీ, మాజీ జెడ్పిటిసి అంబటి కృష్ణంనాయుడు, వైస్ ఎంపిపిలు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పార్వతీపురం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

వీరఘట్టం : మండలంలోని వండువలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి క్యాంపు కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సర్పంచ్ మిడతన కళ్యాణి, వైసిపి మహిళా విభాగం జిల్లా కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు, పి.లక్ష్మణరావు, అలజంగి ఎలియా, కందుల వెంకటరావు, అభిమానులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య, గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట సర్పంచ్‌లు బొత్తాడ గౌరీ శంకరరావు, ఆర్.చైతన్య స్రవంతి, నాయకులు నిమ్మక గోపాల్, ఎద్దు మురళి, వహిద్ ఖాన్ పలువురు నాయకులు ఉన్నారు.

భామిని: భామిని వైసిపి కన్వీనర్ తోట సింహాచలం ఆధ్వర్యంలో బాలేరులో వైఎస్ జగన్ పుట్టిన రోజులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి కన్వీనర్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమం వైసిపి నాయకులు కొత్తకోట ఆంజినేయులు, గెల్లంకి రమేష్, మెడిబోయిన చలపతి రావు, శ్రవణ్ కుమార్, గేదెల మోహన్ తదితరులు పాల్గొన్నారు.